వ్యాసం

# గిరిజనులు-గిరిజన సంస్కృతి

—బాలగోపాల్

ప్రతి దేశానికీ తన నైసర్గిక, చారిత్రక, సామాజిక, ప్రత్యేకతలు కొన్ని వుంటాయి. భారతదేశానికి గల ప్రత్యేకతలలో 'గిరిజనులు' అనేది ఒకటి. ఇతర దేశాలలో గిరిజనులు లేరని కాదుగాని,మనదేశంలో గిరిజనులకు ఒక ప్రత్యేకమయిన స్థానం వుంది. సంఖ్యరీత్యా జనాభాలో 7 శాతమే అయినా గిరిజనులు దేశంలోని అన్ని రాష్ట్రాలలోను నివసిస్తున్నారు. బ్రిటిష్ వాళ్ళకాలం నుండి ఇప్పటి దాకా మనదేశం సాధించిన 'అభివృద్ధి' వల్ల అత్యధికంగా నష్టపోయింది గిరిజనులే. అత్యధికంగా ఈ 150 సంవత్సరాలలో తిరుగుబాట్లు చేసింది గూడా గిరిజనులే.

గిరిజనులు అనగానే తలలో ఈకలు, మొలలో గజ్జెలు ఉండే విచిత్ర జీవులని సామాన్య నాగరికులు భావిస్తారు. ఎక్కడో అడవులలో నివసిస్తూ తెల్లబట్టలు కనబడ గానే పారిపోయే భయస్తులు అని కొంత చదువుకున్నవాళ్ళు భావిస్తారు. గిరిజనుల మాటే చెప్పాలంటే వాళ్ళు తమను తాము 'కొండమనుషుల' గాను 'అడవి మనుషుల' గాను వర్ణించుకుంటారు. ఈ రకంగా చూస్తే వాళ్లకు మనం పెట్టుకున్న గిరిజనులు. ఆటవికులు, అనే పేర్లు వాళ్ల చైతన్యం యొక్క సంస్కృతీకరణే.

హిందీ తదితర ఉత్తర భారతదేశపు భాషలలో ఈ రెండు పేర్ల బదులు 'ఆదివాసులు'అన్న పేరు ప్రయోగిస్తారు. గిరిజనులే ఈ దేశంలో నిజమయిన ఆది వాసులని 'మనం' అంతా ఎప్పుడో ఒకప్పుడు బయటనుండి వచ్చి ఆదివాసులను అడవులలోకి తరిమేసినవాళ్ళమని, ఈ ప్రయోగం వెనక ఒక సిద్ధాంతం వుంది. ఇంకొంచెం విడమర్చి చెప్పాలంటే, మొదట ద్రావిడులు వచ్చి ఆదివాసులను అడవుల లోకి తరిమివేయగా తరువాత ఆర్యులు వచ్చి ద్రావిడులను దక్షిణానికి తరిమేసారని ఈ సిద్ధాంతం. ఏ పుస్తకంలోనూ ఈ సిద్ధాంతం రాయకున్నా దీన్ని నమ్మేవాళ్ళు చాలా మంది ఉన్నారు.

మనదేశానికి మొట బయటినుండి ద్రావిడులు (అంటే ద్రవిడ భాష మాట్లాడే వాళ్ళు) తరువాత ఆర్యులు, వచ్చినమాట వాస్తవమే. ఇవ్వాళ్ళ వీళ్ళ భాషలు ప్రబలంగా ఉండడాన్నిబట్టి చూస్తే ఇక్కడి ఆదివాసుల మీద వీళ్ళు ఆధిపత్యం నెలకొల్పినట్టు గూడ తోస్తుంది. అయితే వీళ్ళు ఆదివాసులను అడవులలోనికి తరిమేసి తాము మైదానాలను ఆక్రమించుకున్నారన్న సిద్ధాంతానికి ఋజువు దొరకదు. వీళ్ళు

'శుద్ధంగా' ఎన్నడు ఉండలేదు. ఇక్కడి ఆదివాసులతో కేవలం సామాజికంగానే కాక భౌతికంగా గూడ కలిసిపోయారు. ఈ సందర్భంలో గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే ఇవ్వాళ మైదానాలుగా ఉన్న ప్రాంతాలు ఎల్లప్పుడూ మైదానాలుగా లేవు. ఒకప్పుడవి దట్టమయిన అడవులుగా వుండేవి. విదేశాల నుంచి వచ్చిన ద్రావిడుల 'అంశ' ఇవ్వాల్టి గిరిజనేతరులలోనే కాదు. గిరిజనులలోనూ వుంది. ఆది వాసుల 'అంశ' గూడ ఇద్దరిలోనూ ఉంది. ఇవ్వాల్టి తెగలలో కొన్నింటిని శాస్త్రజ్ఞులు ద్రవిడపూర్వ (Pre–Dravidian) తెగలుగా గుర్తిస్తే మరికొన్నింటిని ద్రవిడ తెగలుగా గుర్తిస్తారు. నీలగిరి కొండలలోని తోడ (Toda) పశుపోషక తెగనయితే ద్రవిడపూర్వ తెగగాని, ద్రవిడ తెగగాని కాదని, బహుశా పశ్చిమ ఆసియా నుండి వచ్చి ఇక్కడ స్థిరపడ్డ తెగ అని, భావిస్తారు. బంజారా (లంబాడా)లు గూడ పశ్చిమ ఆసియా నుండి వచ్చిన తెగ అనే అభిప్రాయం ఉంది. మరయితే ఇవ్వాళ కనుపించే గిరిజన గిరిజనేతర విభేదానికి మూలాన్ని ఎక్కడ చూడాలంటే దానికి సమాధానం వేరేవుంది.

మనదేశమంతా ఒకప్పుడు అడవే అయినట్టు మనం అంతా గూడ ఒకప్పుడు ఆటవికులమే. వేట, పశుపోషణ, ఆహార సేకరణ, పోడువ్యవసాయం, జీవనాధారాలుగా వుండేవి. ద్రావిడులయినా ఆర్యులయినా మనదేశానికి వచ్చినప్పుడు ఈ స్థాయిలో ఉన్నవారే. సామూహిక శ్రమ, సమిష్టి జీవనం, సమానత్వం, ఆ స్థాయికి తగ్గ సామాజిక సంబంధాలు. ఇది క్రమంగా విచ్ఛిన్నమవుతూ వచ్చి, నదీ డెల్టా ప్రాంతాలలోనూ, లోయలలోనూ, ఇతరత్రా వ్యవసాయ యోగ్యమయిన ప్రాంతాలలోనూ స్థిర వ్యవసాయం ప్రారంభమయి, ఆదిమ ఆటవిక సమాజం నశించి అడవులు క్రమంగా మైదానాలయ్యాయి. ఆటవిక సమాజం ఒకరినొకరు దోచుకునే వ్యవసాయిక వర్గ సమాజంగా మారింది. ఆనాటి వ్యవసాయ పద్ధతుల పరిధిలో అంతగా వ్యవసాయ యోగ్యంకాని కొండలూ, పీఠభూములూ అడవులగానే ఉండిపోయాయి. మైదాన ప్రాంతాల ప్రజలు ఆటవిక సామూహిక సంబంధాలు వదులుకొని మనదేశపు వర్గ సమాజానికి ప్రత్యేక లక్షణమయిన కుల సంబంధాల నిర్మాణంలోకి వచ్చారు. ఇట్లా నాగరికులయిన వాళ్ళు ఎప్పటికప్పుడు విస్తరిస్తూ చుట్టూ వున్న అడవులను ఆక్రమించుకొని మైదానాలను చేస్తూ అక్కడికి ఆటవికులను వర్గ సమాజపు అధోభాగానికి బలవంతంగా కలుపుకుంటూ, వాళ్లను గూడ ఈ విధంగా నాగరికులను చేస్తూ వచ్చారు.

మనదేశం యొక్క సామాజిక–నైసర్గిక లక్షణాలను దృష్టిలో ఉంచుకుంటే ఈ చారిత్రక క్రమాన్ని పునర్నిర్మించుకోవచ్చు. మూడు నుండి నాలుగువేల సంవత్సరాల క్రితం సముద్ర తీరములోని నదీ డెల్టాలలోనూ, నదీలోయలలోనూ, ఇతరత్రా అనుకూలమయిన ప్రాంతాలలోనూ, ఆటవిక సమాజం నశించి వ్యావసా

యిక వర్గసమాజం ఏర్పడడం ప్రారంభమయింది. సముద్ర తీరములోని పల్లపు భూములు, కృష్ణ, గోదావరి, కావేరి, మహానది, నర్మద, తపతి, ఇతర ఉత్తర భారతదేశపు నదులు, ఒక్కొక్కటి ఒక్కొక్క కేంద్రమయింది. ఈ ఒక్కొక్క కేంద్రంలో ఏర్పడ్డ వర్గసమాజం ఒక్కొక్క 'జాతి'కి (తెలుగు, తమిళ, మలయాళ, మరాఠా, ఒరియా, వగైరా) బీజమయింది. ఈ జాతులు ఆ కేంద్రంనుండి వీలైనంత దూరం విస్తరిస్తూ అడవులను మైదానాలను చేస్తూ అక్కడి ఆటవికులను తమలో బలవంతంగా కలుపుకుంటూ పోయాయి. ఈ విధంగా ఒక్కొక్క ఆధునిక జాతి ఏర్పడింది. ఒక జాతికీ మరొకజాతికీ మధ్య, వాటి విస్తరణకు ఇంతవరకు లొంగని అడవులు, పీఠభూములు, మిగిలిపోయాయి. అక్కడ నివసించే ఆటవికులు ఆర్థికంగా ఇప్పటికీ ఆటవికులుగానూ సాంస్కృతికంగా ఏ జాతికీ చెందనివారుగాను మిగిలి పోయారు. అందుకే మనదేశంలో ఏ రెండు పరిసర రాష్ట్రాలను తీసుకున్నా వాటి సరిహద్దులో అడవులు, కొండలు, పీఠభూములు, అక్కడ నివసించే గిరిజనులు కనబడతారు. ఏ రాష్ట్రంలోనూ గర్భంలో గిరిజనులు కనబడరు. మన రాష్ట్రాన్నే తీసుకుంటే ఉత్తర సరిహద్దుకు ఒక చివరనున్న శ్రీకాకుళం నుండి పడమటికి ఆదిలాబాద్, నిజామాబాద్ దాకా దట్టమయిన అడవులు, కొండలు. ఆ అడవులలో నివసించే సవర, జాతాపు, కోయ, కొండరెడ్డి, నాయకపు, గోండు, కోలాం, తదితర గిరిజనులు కనబడతారు. ఈ సరిహద్దు దాటితే ఒరియా, హిందీ, మరాఠి భాషలు మాట్లాడే నాగరికులు తగులుతారు. అలాగే దక్షిణాన రాయలసీమ జిల్లాలో తూర్పు కనుములు, నల్లమలై కొండలు, ఈ అడవులలో నివసించే చెంచు, యానాది ఎరుకల, గిరిజనులు కనబడతారు. ఆ సరిహద్దు దాటితే తమిళ కన్నడ జాతులు తగులుతాయి.

ఇది ఏ రాష్ట్రానికయినా వర్తిస్తుంది. ఒరిస్సాకు దక్షిణ సరిహద్దు జిల్లాఅయిన కొరాపుట్‌లో సవర, బోండ్, గదబ తెగలు నివసిస్తాయి. అటుచివర ఒరిస్సాను బీహార్ నుండి వేరుచేసే చోటానాగ్‌పూర్ పీఠభూమి అడవులలో కోవ్, ఒరవాన్, సంథాల్, ముండు తెగలు నివసిస్తాయి. తూర్పు పశ్చిమబెంగాల్ సరిహద్దులోని చిటగాంగ్ కొండలలో చక్మా గిరిజనులు నివసిస్తారు. గుజరాత్–రాజస్థాన్ రాష్ట్రాల సరిహద్దు పీఠభూమిలో భిల్లులు నివసిస్తారు. మహారాష్ట్ర దక్షిణ సరిహద్దులో వర్లీలు, తమిళనాడు, కేరళ సరిహద్దులో, పడమటి కనుమలలో పాలియన్‌లు, తమిళనాడు, కర్నాటక సరిహద్దు దగ్గరున్న నీలగిరి కొండలలో తోడ తెగ గిరిజనులు, మహారాష్ట్ర మధ్యప్రదేశ్ సరిహద్దు అడవులయిన సిరోంచ బస్తర్‌లలో గోండులు, కోయలు నివసిస్తారు.

ఈ గిరిజనులందరూ గూడా ఇప్పటివరకు ఆయా ప్రాంతాల వర్గసమాజ విస్తరణకు లొంగనివాళ్ళు. ఈ విస్తరణ, మనదేశ చరిత్రలోని ముఖ్యమైన భౌతిక

క్రమాలలో ఒకటి. నాలుగు వేల సంవత్సరాలుగా మైదానాలు, అడవులను ఆక్రమించుకుంటున్నాయి. ఇది ఇప్పటికీ అంతరించని క్రమం, ఇది శాంతియుతంగాను మర్యాదగాను సాగిందని అనుకుంటే భ్రమే అవుతుంది. ఇవ్వాళ కాంట్రాక్టర్లద్వారా, ప్లాంటేషన్‌ల ద్వారా, వడ్డీ వ్యాపారస్తుల ద్వారా, గిరిజనేతర భూస్వాములు భూ ఆక్రమణ ద్వారా, ఎంత దౌర్జన్యంగా సాగుతున్నదో గతంలోగూడ అంతే దౌర్జన్యంగా సాగింది. మౌర్య చక్రవర్తి అశోకుడి ఘనతను కీర్తించే చరిత్రకారులు, ఆయన అడవులను వ్యవసాయం కిందికి తీసుకురావడానికి చేసిన ప్రయత్నాన్ని ప్రముఖంగా ప్రస్తుతిస్తారు. కొత్తగా భూములు వ్యవసాయం కిందికి వస్తే, రాజుగారికి రెవెన్యూ పెరుగుతుంది కాబట్టి, అడవులను నరికి వ్యవసాయ యోగ్యంచేసి కొత్త గ్రామాలను ఏర్పరచేవాళ్ళకు ప్రోత్సాహం ఇచ్చేవాడు. అట్లా కొత్తగా ఏర్పడ్డ గ్రామాలకు కొంతకాలం రెవెన్యూ మాఫీ చేసేవాడు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలోగూడ ఇటువంటి ఎత్తుగడల ప్రస్తావన ఉంది. ఈ విధంగా రాజుగారి ప్రోత్సాహంతో చాలామంది నాగరికులు అప్పటికింకా దట్టమయిన అడవులతో నిండివున్న గంగా, యమునా లోయలను వ్యవసాయ యోగ్యం చేశారు. అప్పటి ఆటవికులు ఈ అక్రమానికి లొంగిపోయి తమ స్వతంత్ర జీవితాన్ని వదిలిపెట్టి కూలీలుగా మారిపోక తప్పలేదు. హిందూ సమాజపు నిమ్నకులాలలో (ఎక్కువగా మాల మాదిగ కులాలలో) కలిసిపోయారు ఈ మార్పును ప్రతిఘటించ దలచుకున్న వాళ్ళకు సారవంతమయిన మైదానాలను వదిలి ఛోటానాగపూర్ వంటి పీఠభూమి ప్రాంతాలకు వెనక్కి వెళ్ళడం తప్ప గత్యంతరం లేదు కాబట్టి కొంత ప్రతిఘటించినా, అంతిమంగా చాలామంది లొంగిపోయే ఉంటారు. అశోకుడి కాలంలో చక్రవర్తి ప్రోత్సాహంతో జరిగిన ఈ దౌర్జన్యం ఇతర కాలాలలో చాలా మామూలుగా జరుగుతూనే వచ్చింది.

ఈ రకంగా ఆటవికులను నాగరికులను చేస్తూ నాగరిక వర్గసమాజపు అధోభాగంలో (కూలివర్గంగా, తక్కువ కులాలుగా) కలుపుకుంటూ వచ్చిన అత్యంత ప్రధానమయిన ఈ క్రమానికి మనకు ప్రత్యక్షమయిన సాక్ష్యాలుగాని ఆధారాలుగానీ దొరకవు. ముస్లిం రాజవంశాల పరిపాలనకు పూర్వం మన దేశంలో ప్రజల చరిత్ర అటుంచి రాజుల చరిత్ర సహితం ఎవ్వరూ రాయలేదు. అయితే ఈ క్రమం యొక్క ప్రతిబింబం మన పౌరాణిక సాహిత్యంలోనూ, గిరిజనుల పురాణ గాథలలోనూ, కనబడుతుంది. గిరిజనుల దేవతలు, వాళ్ళ 'ఆదిపురుషులు', హిందూ పురాణాలలో ప్రవేశిస్తారు. హిందూ దేవతలతో సమానంగాకాదు, వాళ్ళ సేవకులుగా, భక్తులుగా వాళ్ళ కరుణా కటాక్షాలచేత పునీతులయిన పాపులుగా, హిందూ పౌరాణిక హీరోలకు రెండవ భార్యలుగా కనబడతారు. హిందువుల వర్గసమాజంలోకి అల్పస్థాయిలో ప్రవేశించినవారు వాళ్ళ సాహిత్యంలోకి గూడ అల్పస్థాయిలో ప్రవేశించక తప్పలేదు.

రాముడి దర్శనం కోసం పడిగాపులు కాసి అతడు తాను ఎంగిలి చేసిన ఫలాల్ని తినగానే జన్మ తరించిందనుకున్న శబరి సవర తెగకు చెందిన స్త్రీ. రాముడు అరణ్యాలకు పోతున్నప్పుడు దారిలో అతని సేవచేసిన గుహుడు ఛోటానాగపూర్ ప్రాంతానికి చెందిన సంథాల్, కోల్ లేక ఒరవాన్ తెగ గిరిజనుడు అయివుండాలి. ద్రోణుడు విలువిద్య నేర్పడానికి నిరాకరిస్తే అతని విగ్రహాన్ని ప్రతిష్టించి తానే విలువిద్య అభ్యసించి, చివరికి ఆ గురువుగారికి గురుదక్షిణగా తన బొటనవేలు ఇచ్చిన ఏకలవ్యుడు భిల్లు తెగకు చెందినవాడు. అడవిలో పడుకున్న కృష్ణుడిని దూరంనుండి చూసి మృగం అనుకుని బాణంవేసి చంపిన జంభుడుగూడ భిల్లుతెగకు చెందినవాడే ఈ విధంగా హిందూ పురాణాలలోనికి హేయమయిన స్థానంలో ప్రవేశించడమేకాక, తమ పౌరాణిక గాథలలోగూడ గిరిజనులు దానిని ఆమోదిస్తారు. కృష్ణుడిని చంపిన పాపంవల్ల భిల్లులకు విల్లంబులు వాడరాదనే శాపం తగిలిందని, అందుకే భిల్లులు విల్లంబులు వాడలేరని నమ్ముతారు పాండవులు లక్కఇంటి నుండి తప్పించుకొని అడవులలో తలదాచుకుంటున్నప్పుడు భీముడు హిడింబ అనే ఆటవిక స్త్రీని పెళ్ళిచేసుకొని ఆమె వల్ల ఒక కొడుకు పుట్టగానే ఆమెను తరిమేస్తాడు. మన దేశంలోని అన్ని గిరిజన తెగలలోకి అత్యధిక సంఖ్యాకులయిన గోండులు తమను తాము ఆ హిడింబ సంతానంగా భావిస్తారు. గోండులకు 'భీం' ముఖ్యమయిన దేవుళ్ళలో ఒకడు 'భీం' అనేది చాలా సామాన్యమయిన పేరు. ప్రతి సంవత్సరం భీమ హిడింబల వివాహాన్ని గోండులు విప్పసారాతో వేడుకగా జరుపుకుంటారు. నల్లమలై కొండలలో నివసించే చెంచులలో గూడ ఇటువంటి పురాణమే ఉంది. అడవులలో తిరుగుతున్న నరసింహుడు ఒక చెంచు యువతిని పెండ్లి చేసుకొని ఆమెకు చెంచులక్ష్మి అని నామకరణం చేసి వైకుంఠం తీసుకుపోతాడు. అక్కడి ఆదిలక్ష్మి (మార్వాడీల లక్ష్మి) ఈ సవతిని ఒల్లకపోయే సరికి నరసింహుడు విధి లేక ఆమెను వదిలిపెడతాడు. అందువల్ల చెంచు స్త్రీలకు అందవికారంగా ఉండాలనే శాపంకూడా ఉందని చెంచులు నమ్ముతారు. 'అంటే నాగరిక సమాజానికి లొంగిపోయే క్రమంలో, ఆటవిక స్త్రీలు 'అందగత్తెలు' కారన్న నాగరిక ప్రమాణాన్ని తాముకూడ ఆమోదించడమే కాక దానికి ఇటువంటి కథ ద్వారా పౌరాణిక 'వివరణ' గూడ ఇచ్చుకుంటున్నారు. సాంస్కృతిక దౌర్జన్యం ఎంత బలంగా ఉండగలదో దీనివల్ల అర్థమవుతుంది.

రామాయణం రాసిన వాల్మీకిగూడ భిల్లుతెగకు చెందినవాడే. అతడు 'బందిపోటు' అనీ, రామాయణం రాసి పునీతుడయ్యాడనీ మనం చదువుకున్నాం. వాస్తవానికి భిల్లులు చాలావరకు ఆహార సేకరణ (food-gathering) మీద ఆధారపడి

జీవించే తెగ. అంటే కనబడ్డ ఆహారాన్ని ఏరుకొని (జంతువయితే పట్టుకొని) జీవి స్తారు. స్వంత ఆస్తిమీద ఆధారపడే వర్గసమాజం ఆహార సేకరణను దొంగతనంగా భావిస్తుంది. భావించడమేకాదు, ప్రతీ వస్తువునూ ఎవరో ఒకరి ఆస్తిగా ప్రకటించడం వల్ల వాళ్ళను బలవంతంగా దొంగలుగా మారుస్తుంది. (శాసనాలంటే చాలా ప్రేమ ఉన్న బ్రిటిష్‌వాళ్ళు వీళ్ళకు (criminal tribes) అని పేరుగూడ పెట్టారు. భిల్లు డయిన వాల్మీకి ఈ విధంగా నాగరికులచేత బందిపోటుగా గుర్తించబడ్డాడు. గుర్తించ బడి, ఆ నాగరికులకు పవిత్ర గ్రంథమయిన రామాయణాన్ని రాసి పవిత్రుడ య్యాడు!

వర్గసమాజం గిరిజనులను లోబరుచుకునే క్రమంలో వాళ్ళదేవుళ్ళనూ గుళ్ళనూ స్వంతం చేసుకుంది. కర్నూలు జిల్లాలోని శ్రీశైలం, అహోబిలం దేవాలయాలు ఒక ప్పుడు చెంచులవేనని చరిత్రకారులు నమ్ముతారు. తిరుపతి, భద్రాచలం, మొదలైన కొండలలోనూ, అడవులలోనూవున్న దేవాలయాలు చాలావరకు ఒకప్పుడు గిరిజనుల వేనని చెప్పవచ్చు. అడవులను ఆక్రమించుకొని, అక్కడ ఆటవికులను కూలివాళ్ళ గానూ శిస్తు చెల్లించే రైతులగానూ లోబరుచుకునే క్రమంలో భాగంగా వాళ్ళ దేవుళ్ళకు ప్రమోషన్ ఇచ్చి విష్ణు అవతారంగానో ఈశ్వరుడి ప్రతిరూపంగానో గుర్తించాల్సిన అవసరమే లేకపోతే,అంతటి మారుమూల ప్రాంతాలలో దేవాలయాలు నిర్మించాల్సినఅవసరం ఏ రాజుగారికయినా ఎందుకు కలుగుతుంది?అయితే ఇదంతా ప్రయత్నపూర్వకంగా చేసిన కుట్ర అనుకుంటే పొరబాటవుతుంది. చరిత్రలో 90 శాతం కుట్రలు ఎవ్వరిప్రయత్నం లేకుండ, చరిత్రగమనంలో భాగంగానే జరిగేవే.జరి గిన తరువాత వాటిని వివరించే పౌరాణిక గాథలు గూడ 90 శాతం ఎవరి ఉద్దేశ్యం లేకుండ కల్పించబడతాయి. పూరీ జగన్నాథుడి దేవాలయం ఇవ్వాళ హిందువులకు ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో ఒకటి. కాని ఆ గుడిలో జగన్నాథుడి బొమ్మను చూసిన వారెవరికైనా అతడు అటవికుల దేవుడనినిస్సందేహంగా తెలుస్తుంది.మామూ లుగా హైందవ దేవుళ్ళ విగ్రహాలకుండే అంగసౌష్టవంగాని కూర్పుగాని ఉండదు. చాలా 'ఆటవికంగా' వుంటుంది. ఆ గుడి ఒకప్పుడు బీహార్ – బెంగాల్ – ఒరిస్సా రాష్ట్రాల సరిహద్దులలో నివసించే లోథా తెగ గిరిజనులది. ఆ లోథా తెగను లోబరచు కొని కోస్తా ఒరిస్సాకు పాకిన హైందవ వర్గసమాజం ఆ గుడిని స్వంతం చేసుకుంది. ఈ దురాక్రమణను లోథాలు ఒక కద ద్వారా పురాణీకరించుకున్నారని కమలాదేవి ఛటోపాధ్యాయ అంటుంది.పూరీలో మహారాజు జగన్నాథుని విగ్రహాన్ని లోథాల దగ్గరి నుండి దొంగిలించేందుకు తన మంత్రిని పంపాడట.ఆ మంత్రి లోథాలప్రభువు కుమార్తెను ప్రేమిస్తున్నట్టు నటించి ఆమెను పెళ్ళి చేసుకొని కొంతకాలం అక్కడే

నివసించాడట. నెమ్మదిగా వాళ్ళ విశ్వాసం సంపాదించి విగ్రహాన్ని చేజిక్కించుకొని భార్యను వదిలిపెట్టి వెళ్ళిపోయాడట.

ఇవ్వాళ మనం మనకళ్ళముందు ఇటువంటివి చూడగలుగుతాం. ఒకప్పుడు కేవలం గిరిజనుల పుణ్యతీర్థాలయినవి (ఉదాహరణకు తెలంగాణాలోని కేస్లాపురం, మేడారం వగైరా) ఇప్పుడు క్రమంగా గిరిజనేతరుల జాతరలవుతున్నాయి. కొంత కాలానికి అక్కడి గిరిజన దేవుళ్ళు హిందుదేవుళ్ళ అవతారాలుగా పరిణామం చెంది గిరిజన దేవుళ్ళ గుళ్ళస్థానంలో హిందు దేవాలయాలు వెలిసినా ఆశ్చర్యంలేదు.(అదిలాబాద్‌లోని గోండ్ల పుణ్యస్థలమయిన కేస్లాపురంలో శివుడి ఆలయం నిర్మించాలని కిందటి సంవత్సరం అక్కడికాంగ్రెసు(ఐ) యువగూండాలు సూచించారు.)గిరిజనుల అడవులను ఆక్రమించుకొని వాళ్లను భూమిలేని రైతులుగాను వేతన కూలీలుగాను మారుస్తున్న క్రమానికి యిది సాంస్కృతిక ప్రతిబింబమే తప్ప వేరేకాదు. ఈక్రమం ప్రాచీనమయినదే అయినా ఇప్పుడు మరింత వేగంగా సాగుతోంది. ఫ్యూడల్ రాచరిక ప్రభువులకు అడవులవల్ల వుండే ఉపయోగాలు చాలా పరిమితమయినవి. సామ్రాజ్యవాదం అలాకాదు. అడవులలో కలపనుండి ఖనిజాలవరకు ఎన్నిరకాల వనరులుంటే అన్నీ సామ్రాజ్యవాదానికి కావాలి. అందుకే గత 150 సంవత్సరాలలో మాదినంత వేగంగా గిరిజనుల జీవితం ఎన్నడూ మారలేదు. గతకాలంలో కొన్ని వందల సంవత్సరాల పరిణామ ఫలితంగా గిరిజనులు కూలీలగాను రైతులగాను మారి వర్గసమాజపు వర్గచట్రంలో ఇరుక్కున్నారు. ఇవ్వాళ ఒక్కఖని తవ్వకమయినా ఒక్క ప్రాజెక్టు నిర్మాణమయినా ప్లాంటేషన్ల కోసం అడవుల సంరక్షణ అయినా కొద్ది సంవత్సరాల కాలంలో కొన్ని వేలమంది గిరిజనుల జీవితాలను చిన్నాభిన్నం చేస్తుంది. గోదావరి మీద ఇచ్ఛంపల్లి ప్రాజెక్టు నిర్మిస్తే అది ఒక్క దెబ్బతో అక్కడి గోండుకోయ తెగల జీవితాలలో రెండు శతాబ్దాల పరిమాణాన్ని సాధిస్తుంది.

గిరిజన సంస్కృతి :- ఈ పరిణామంపట్ల ఇవ్వాళ చాలా విస్తృతంగా వ్యతిరేకత కనబడుతోంది. భౌతికవాద దృక్పథంతో చూసేవాళ్ళకు దీన్ని విమర్శించడంలో ఎటువంటి సందేహం ఉండదు. కలప పరిశ్రమ, ఖనిజ పరిశ్రమ, అభివృద్ధి చెందడం వల్ల దేశానికి లాభం కాబట్టి ఈ పరిణామాన్ని వ్యతిరేకించ కూడదని పాలకవర్గాలు బోధిస్తారు. అయితే ఈ ప్రాజెక్టులవల్ల, ఈ కలప పరిశ్రమవల్ల, ఈ గనుల తవ్వకం వల్ల, 'దేశానికి' లాభం కలుగుతోందని అంగీకరించడం కష్టం. లాభపడుతున్నది 'దేశమే' అయితే మరి గిరిజనులు గూడ దేశంలో భాగమేకదా, వాళ్ళెందుకు నష్టపోతున్నారు? గిరిజనులకేకాదు, అడవుల సమీపంలో నివసించే సామాన్య గిరిజ నేతరులకు గూడ లాభం కలగడంలేదు. లాభమంతా పెద్ద వ్యాపా

రస్తులకు, సామ్రాజ్య వాదదేశాలకూ కలుగుతోంది. అడవులనుండి బయటకు వెళ్ళే కలప అయినా తునికాకయినా బొగ్గు ఇనుము తదితర ఖనిజాలయినా అంతిమంగా ఎక్కడికి చేరుకుంటాయో, మార్గమధ్యంలో ఎవరెవరికి ఎంతెంత లాభాలు సమకూరు స్తాయో పరిశీలిస్తే ఈ 'దేశానికి లాభం' అనేది ఎంతబూటకమో అర్థమవుతుంది. అడవులనుండి కూలివాళ్ల చేత సరుకును సేకరించే కాంట్రాక్టర్లు, ఫారెస్ట్ అధికార్లు, అక్కడినుండి రవాణా చేసే ట్రాన్స్‌పోర్ట్ కంపెనీల యజమాన్లు, ఆ సరుకును వినియోగించే టింబర్ మిల్లులు బీడీ కార్ఖానాలనుండి ఇనుము ఉక్కు ముడిసరుకును వినియోగించే పెద్దపరిశ్రమల దాకా వివిధపరిశ్రమల యజమాన్లు యజమాన్ల యిన విదేశీ గుత్తపెట్టుబడి దారీ కంపెనీలు,ప్రభుత్వాలు,వీళ్లకే తప్ప'దేశానికి'లాభం ఎంతమాత్రం ఉండదు. దేనివల్లనయినా 'దేశానికి' లాభం కలిగించే వ్యవస్థ మన దగ్గర లేదు. ఆస్తి పరులయిన దోపిడీవర్గాలకు మాత్రమే ఈ వ్యవస్థ లాభం కలి గిస్తుంది. శ్రామికులకు లాభం అటుంచి చేసిన శ్రమకు సగం ఫలమే తప్ప పూర్తి ఫలం గూడ దక్కదు.

ఈ రకంగా భౌతిక వాద దృక్పథంతో చూసేవాళ్లే కాకుండ, గాంధీవాదులూ తదితర నానారకాల భావుకులూ గూడా ఈ మార్పును వ్యతిరేకిస్తున్నారు. దీనికి వాళ్ళలో చాలామంది చూపించే కారణమేమిటంటే గిరిజనుల సంస్కృతిని కాపాడా లన్నది. గిరిజనుల సంస్కృతిలోని 'ఉన్నత'మయిన లక్షణాలను వీళ్ళు ఎత్తి చూపు తారు. పెట్టుబడిదారీ సమాజం పూర్తిగా నాశనం చేసిన కళాత్మక, సామూహిక జీవనం, గిరిజనులలో ఉంటాయి. వీటిని నాశనం చేయకూడదని, పదిలంగా కాపాడా లని 'మనం గిరిజనుల నుండి నేర్చుకోవలసినది చాలా వుందని' వీళ్ళు సవినయంగా చెప్తారు. భౌతిక జీవితాన్ని గురించి పట్టించుకోకుండా సంస్కృతిని గురించి మాట్లాడడం విచిత్రమయిన విషయమే అయినప్పటికీ, భౌతికవాదులు సంస్కృతిని తక్కువ చేయరు కాబట్టి గిరిజనుల సంస్కృతిని కొంత పరిశీలించవలసిన అవసరం వుంది.

భౌతికంగా గిరిజనులలో మూడు రకాల తెగలుంటాయి. వేటమీద, ఆహార సేకరణమీద(hunting and food-gathering)ఆధారపడి జీవించేవాళ్ళు, పశుపో షకులు (pastoral tribes) ఆహారాన్ని ఉత్పత్తి చేసేవాళ్ళు(food-producers) మొదటి రకానికి చెందిన తెగలు ఇప్పుడు చాలా తక్కువ. ఉన్న కొద్దిమంది బ్రిటిష్ వలస పాలన తాకిడికి తట్టుకోలేక 'వృత్తి దొంగల'గానో లేక అతి చవకగా పనిచేసే కూలీలగానో మారిపోయారు. వడ్డెర, ఎరుకల, యానాది, తెగలు దీనికి మంచి ఉదా హరణ. పశుపోషకులలో చెప్పుకోదగ్గ తెగ నీలగిరి కొండలలోని తోడ తెగ, ఆహా రాన్ని ఉత్పత్తి చేసే వ్యవసాయదారులయిన తెగలు మాత్రమే ఇప్పటికి ఏదో ఒక

మేరకు నిలిచి ఉన్నాయి.

ఆర్థిక జీవితం ఏదయినా, సామాజిక సంబంధాలలో మాత్రం గిరిజనులలో సమగ్రమయిన 'ఐక్యత ఉంటుంది. దీనికి మూలం గిరిజనులలో భూమి తదితర ఉత్పత్తి సాధనాలలో స్వంత ఆస్తి అనేది లేకపోవడం, బ్రిటిష్ పాలకులు దేశంలో ప్రతి గుంట భూమికి ఒక యజమానిని గుర్తించాలని ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ఈ సమిష్టి ఆస్తి సంబంధాల ఛాయలు గిరిజనులను ఇప్పటికీ వదలలేదు. యెవరి వ్యవసాయం వాళ్ళదే అయినా సమిష్టి పద్ధతితో చేసినట్టు అనిపిస్తుంది. అందరూ వ్యవసాయం ఒకేసారి మొదలు పెడతారు. దానికిచేయవలసిన పూజల తంతు గ్రామం అంతా కలిపి సమిష్టిగా చేస్తారు పంట ఒకేసారి కోస్తారు. అంగడికి గ్రామం అంతాకలిసే పోతారు పెళ్ళయినా చావయినా సమిష్టిగానే జరుపుకుంటారు నిర్ణీత కాలంలో పండుగలూ వేడుకలూ గూడ ఉమ్మడిగా జరుపుకుంటారు. పంట చేసేటప్పుడు పండుగ, కోతలప్పుడు పండుగ, విప్పచెట్టు పూతవేసేటప్పుడు పండుగ, వేసవి తరువాత మొదటి వర్షం కురిసేటప్పుడు పండుగ, ఇట్లా వాళ్ల భౌతిక జీవితంలో ఒక్కొక్క ప్రముఖ సందర్భంలోనూ ఒక్కొక్క పండుగ గ్రామం అంతాకలిసి జరుపుకుంటాను. కొన్ని పండుగల విషయంలో వాటి భౌతిక ప్రాముఖ్యతను స్పష్టంగా గుర్తించగా, కొన్నిటిని భీమదేవర పెళ్ళిగానో మరొక పురాణ పురుషుడి పుట్టుకగానో జరుపుకుంటారు.

గిరిజనుల జీవితంలోని ఈ 'కట్టడి' చాలా మందిని ఆకర్షిస్తుంది. సామ్రాజ్యవాద బూర్జువా సంస్కృతి నాగరిక సమాజాన్ని ముక్కలుముక్కలు చేసింది. పక్కవాడు మనకళ్ళముందు చనిపోయినా మనం పట్టించుకోనంత ఒంటరి వాళ్ళను చేసింది ఘనల్ని. అందుకే ఈ సామ్రాజ్యవాద యుగంలో భావుకులు చాలామంది గిరిజన సంస్కృతిలోని సమిష్టితత్వం చేత ఆకర్షితులవుతున్నారు. కాని గిరిజన సంస్కృతి ఇక్కడితో ఆగిపోదు. వాళ్ళ భౌతిక జీవితానికి ఉండే పరిమితులన్నీ అందులో ప్రతిఫలిస్తాయి. వాళ్ళకు ప్రకృతి గురించి ఉండే పరిజ్ఞానం చాలా పరిమితమయినది కాబట్టి చాలా విచిత్రమయిన భ్రమలు ఏర్పరచుకుంటారు. కదిలే ప్రతి వస్తువులోనూ (కొన్ని కదలని వస్తువులలోగూడ) తనుకున్నట్టే ప్రాణం వుందని భావిస్తారు. గాలిలో చెట్ల లో నదులలో భూమిలో పైరులో ఉన్న ఈ 'జీవి'తో మంచిగా ఉండడం అవసరం అనుకుంటారు. దానికి తిండి పెడతారు. దానికి ఏ తిండి ఇష్టం అనుకుంటారో ఆ తిండి వెతుక్కొచ్చి పెడతారు. ఇదే క్రమంగా బలులకు (నరబలులకు సహితం) దారితీస్తుంది. ఆ జీవిని ప్రసన్నం చేసుకోవడం కోసం నృత్యాలు చేసి పాటలు పాడతారు. గిరిజనుల నృత్యాలూ పాటలూ చాలావరకు ఈ రకంగా చిల్లర

దేవతలను ప్రసన్నం చేసుకోవడం కోసమే. లౌకికమైన (సెక్యులర్) నృత్యంగాని పాటగాని కళగాని గిరిజనులలో అరుదు. అందుకే కొన్ని నృత్యాలు ఎప్పుడుబడితే అప్పుడు చేయమంటే చేయరు. నిర్ణీత సమయంలోనే నిర్ణీత పద్ధతిలోనే చేస్తారు. ఒక్క నృత్యం మాత్రమే కాదు. అన్నీ నిర్ణీతమయిన పద్ధతిలోనే జరుగుతాయి. 'భయంతో బిగుసుకు పోవడం' అనే నుడికారం ఉంది. గిరిజనుల జీవితం అట్లా బిగుసుకుపోయి ఉంటుంది. భయంతో కాకపోవచ్చుగాని, తమకే అర్థంకాని విశ్వాసాలతో బిగుసుకుపోయి ఉంటుంది. పుట్టుక, పెళ్ళి, చావు, ఆట, పాట, వ్యవసాయం, అన్నీ కూడ ఖచ్చితమయిన, నిర్ణీతమయిన, పద్ధతిలోనే జరగాలి. ఏ మాత్రం తప్పినా ఉపద్రవం ముంచుకొస్తుంది. ఈ ప్రపంచాన్ని శాసించే అదృశ్య శక్తులను ప్రసన్నం చేసుకోవడం కోసం తామే ఏర్పరచుకున్న నియమాలు తమనుండి పరాయీకరణ చెంది ఈ ప్రపంచాన్ని నిలబెట్టే మానవాతీతమయిన చక్రంగా మారిపోతాయి. ఆ చక్రాన్ని కదిపితే ప్రపంచమే కూలిపోతుంది. ఈ మానసిక స్థితిని అర్థం చేసుకోవాలంటే ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. మనలో ఆస్తికులైన వాళ్ళు గూడ తమ చుట్టూ ఎల్లప్పుడూ అదృశ్య శక్తులు మూగి ఉంటాయని నమ్మరు (రాత్రిపూట తప్ప). గిరిజనులు అట్లాకాదు. వాళ్ళ దృష్టిలో ఈ ప్రపంచమంతా అద్భుతమయిన అదృశ్య శక్తులతో నిండివుంటుంది. చివరికి తాముకూడ చనిపోయిన తరువాత ఎక్కడో దూరంగా ఉండే కైలాసానికో వైకుంఠానికో పోరు. గిరిజనులు వివిధ పేర్లతో పిలుచుకునే మరణానంతర నివాసస్థలం దగ్గరిలోనే వుంటుంది. (సాధారణంగా నేలకింద 'పాతాళం'లో వుంటుంది.) చనిపోయినవాళ్ళు అక్కడ జీవిస్తూ వుండి ఇక్కడి నిత్యజీవితంలో కలగజేసుకుంటూ ఉంటారు (అందుకే భోజనం చేసేటప్పుడు-ముఖ్యంగా పండగలప్పుడు-చనిపోయిన పూర్వీకులకు రెండు, ముద్దలు 'పిండం' తీసి పక్కకు పెడతారు.) ఈ అసంఖ్యాకమైన అదృశ్య శక్తులను ఎప్పటికప్పుడు మంచి చేసుకుంటూ వుండాలి. వాటికి కోపం తెప్పించకూడదు. తమకు ఏదయినా మంచి జరిగినా అది ఈ అదృశ్యశక్తుల ఈర్ష్యకు గురికాకుండా ('దృష్టి' తగలకుండ) చూసుకోవాలి. కొన్ని తెగలలో, పంట బాగా పండినా సరే ఆ విషయం బయటికి తెలిస్తే అదృశ్య శక్తుల దృష్టి తగులుతుందేమోనని ఒక పూటంతారోధిస్తూ పంట నాశనమయిపోయిందని పాటపాడుతూ నృత్యం చేస్తారు. సవర తెగ గిరిజనులు పెళ్ళి చేసేటప్పుడు ముందు అమ్మాయికి విల్లంబుతో పెళ్ళిచేసి, దానిని నదిలోకి పారేసి, ఈ విధంగా అమ్మాయి 'విధవ' అయిన తరువాతే పెళ్ళి చేస్తారు. ఈ అటవిక ఆచారాలు ఫ్యూడల్ దశలో గూడ చాలావరకు నాశనంకావు కాబట్టి ఇవన్నీ ఏదో ఒక రూపంలో మనకుగూడ పరిచయమే. చిన్న పిల్లలను అందరూ ముద్దు

చేస్తే 'దృష్టి' తగులుతుందని భయపడి చీపురుకట్ట కాల్చి బూడిదతో బొట్టుపెట్టి వీలయినంత అందహీనంగా తయారు చేస్తాము.) ఈ 'దృష్టి' భయం ఎంతగా వుంటుందంటే గిరిజనులు ఏ వ్యవహారాన్నీ సూటిగా ప్రస్తావించరు. సూటిగా ప్రస్తావించడం అహంకారాన్ని సూచిస్తుంది. అది అదృశ్య శక్తుల ఆగ్రహానికి గురయి వ్యవహారం బెడిసి కొడుతుంది. (ఇది గూడ మన ఫ్యూడల్ సంస్కృతిలో ఇప్పటికీ ఉన్న వైఖరే. సూటిగా, 'బిజినెస్ లైక్'గా, వ్యవహరించడం బూర్జువా అలవాటు.) ఉదాహరణకు పెళ్ళి సంబంధం కుదుర్చుకోవడానికి అబ్బాయి తల్లిదండ్రులు అమ్మాయి ఇంటికి వస్తే ఇరుపక్షాలు అసలు పెళ్ళిమాటఎత్తరు. పక్షులమీద, పశువుల మీద పెట్టి మాట్లాడతారు. కమాలాదేవి ఛటోపాధ్యాయ (Tribalism in India అనే పుస్తకంలో) ఒక ఉదాహరణ ఇస్తుంది:

"ఎవరు మీరు?" అని అమ్మాయివైపు వాళ్ళు గదమాయించి అడుగుతారు.

"మేము అడవులలో లోపల వేటాడే వేటగాళ్ళం. ఇవ్వాళ మేము కొట్టిన జింక పారిపోయి మీ ఇంట్లో దాక్కుంది" అని సమాధానం ఇస్తారు. 'అటువంటిదేం లేద'ని వీళ్ళు అంటారు.

"మేము జింక రక్తపు మరకలను వెంబడించి వచ్చాము. ఇదిగో మీ ఇంటి తలుపు దగ్గర రక్తం మరకలు, మా జింకను మాకు ఇచ్చేయండి" అంటారు.

"మా యింట్లో మేము చిన్నప్పటినుండి పెంచుకున్న జింక మాత్రమేవుంది. మీరు కొట్టిన జింకలేదు" అని వీళ్ళు అంటారు. ఈ విధంగా కొంత వాదన జరిగిన తరువాత అమ్మాయి తరఫువాళ్ళు లొంగుతారు. "అయితే మీజింకే అయివుండాలి. మీకు ఇచ్చేయక తప్పదు. కాని ఒకటి గుర్తుంచుకోండి. మేము దాన్ని చాలా కష్టపడి పెంచాం. దాన్ని తల్లి పుష్కలంగా పాలిచ్చేది. మీ దగ్గర చేలూ అడవులు సమృద్ధిగా వుంటే తప్ప సుఖంగా వుండదు" అంటారు. దానికి అబ్బాయి తల్లిదండ్రులు "మా దగ్గర అడవులూ కంచెలూ సమృద్ధిగా వున్నాయి" అని హామీ ఇచ్చి స్త్రీ ధనం ఎంత ఇచ్చేదీ మాట్లాడుకొని పోతారు.

కళ విషయం గూడ అంతే గిరిజనుల జీవితం చాలా కళాత్మకంగా ఉండే మాట వాస్తవమే. పాట, నృత్యం, అలంకరణ, వాళ్ళ జీవితాలను పెనవేసుకొని ఉంటాయి. వాళ్ళ కళకూ శ్రమకూ మధ్యఉండే సన్నిహితమయిన సంబంధాన్ని జార్జ్ థామ్సన్ లాంటి వాళ్ళు గుర్తించారు. కళ వాళ్ళు శ్రమలో పొందే ఆనందాన్ని వ్యక్తం చేస్తుంది. అలసటను మరిపిస్తుంది. శ్రమ చేయడానికి కావలసిన ఉత్తేజాన్ని ఇస్తుంది. కళలలో వుండే లయ (rhythm) శారీరక శ్రమలోని లయనుండి పుట్టిందని థామ్సన్ అంటాడు. ఈ కారణం చేతనే, బూర్జువా సమాజంలో కళ శ్రమనుండి

పూర్తిగా వేరుపడి మార్కెట్‌లో సరుకుగా మారడంతో అసంతృప్తి చెందిన భావుకులు చాలామంది ఆటవిక జీవితాన్ని ప్రశంసిస్తారు. కాని ఇక్కడగూడ గుర్తుంచుకోవలసిన విషయం ఒకటి వుంది. గిరిజనుల నృత్యం, పాట, చిత్రలేఖనం, అలంకరణ మొ॥ కళ లకు శ్రమ సంబంధమయిన ఆనందంతోను, అలసటతోను, ఉత్తేజంతోను ఉండే సంబంధం అవ్యక్తమయినది (implicit). కళ యొక్క వ్యక్తమయిన (explicit) పాత్ర, అంటే దాని సామాజిక పాత్ర, అంటే గిరిజనుల జీవితంలో దాని ప్రాముఖ్యత, వేరేవుంది. అదేమిటంటే, వాళ్ళు నమ్మిన దేవతలను ప్రసన్నం చేసుకోవడం ద్వారా గానీ, మంత్రం (Magic) ద్వారాగాని, శ్రమఫలాన్ని ఇనుమడింపజేయడం, వేటాడే గిరిజనులు తమ ఇళ్ళ గోడలమీద జంతువులను వేటాడి చంపుతున్నట్టు బొమ్మలు వేస్తారు. వ్యవసాయం చేసేవాళ్ళు పంట చేతికొచ్చే సమయం ఆసన్నమయితే పంట కోస్తున్నట్టు అభినయిస్తూ నృత్యం చేస్తారు. ఇందులో తమ శ్రమకు కళాత్మకరూపం ఇచ్చుకోవడం అనే మానవీయ ప్రక్రియ అవ్యక్తమయినది. దాని వల్ల వాళ్ళు పొందే ఉత్తేజం గూడ అవ్యక్తమయిన ఫలమే. వీటి వ్యక్తమయిన ప్రయోజం గిరిజనుల మూఢ నమ్మకాలతో ముడిపడివుంటుంది. వేట జంతువులను చంపుతున్నట్టు బొమ్మవేస్తే నిజంగానే ఆ ఫలితం దక్కుతుందన్న నమ్మకం గిరిజనులలో వుంటుంది. పంటకోస్తున్నట్టు అభినయిస్తే పంట నిజంగానే పుష్కలంగా పండుతుందని ఆశిస్తారు. ఆదిమ మానవ మనస్తత్వం ఒక వస్తువుకూ ఆ వస్తువు యొక్క ప్రతిరూపానికి (అది చిత్రపటంగానీ,నృత్య అభినయంలోని దృశ్యమేగాని, చివరికి కృత్రిమంగా తాము ఏర్పరచుకున్న సంకేతాలయినాగాని) తేడా చూడదు. ప్రతిరూపానికి ఏం జరిగితే వస్తువుకూ అదే జరుగుతుందని నమ్ముతుంది. ఇది చాలా ఆదిమమయిన మంత్రం (ఇంగ్లీష్‌లో sympathetic magic అంటారు. చేతబడి దీని అవశేషము) తరువాతి కాలంలో చిలవలు పలవలై అభివృద్ధి చెందిన మంత్ర తంత్రాలన్నిటికీ మూలం.

గిరిజనుల కళా జీవితమంతా గూడా ఇంతే. ముగ్గులు పెట్టడంలో సౌందర్య దృష్టి అవ్యక్తమయింది. వాటి అసలు ఉద్దేశ్యం దుష్ట శక్తులను దూరంగా ఉండడం పచ్చలు పొడిపించుకుంటే శరీరాన్ని చనిపోయిన తరువాత దయ్యాలు తినకుండ కాపాడుకుంటాం. మరి వీటిలో కళ లేదా, అందులో సృజనాత్మకమయిన ఆనందం లేదా, అంటే ఉన్నాయి. కాని ఆ కళ, ఆ ఆనందం, వాళ్ళ విశ్వాసాల పరిభాషలోనే రూపం తీసుకుంటాయి. గిరిజనుల ఆలోచనలలో వాళ్ళ విశ్వాసాల ఎంత బలగా

అలుక్కుపోయి ఉంటాయంటే వాళ్ళ శ్రమను, కళాకాంక్షను, సృజనాత్మకతను, విశ్వాసాలను, వేరుచేయడం సాధ్యం కాదు. కళను నిజంగా శ్రమయొక్క ప్రత్యక్ష వ్యవస్థీకరణగా ఒక గిరిజనుడు సృష్టించదల్చుకొన్నా అది అతని విశ్వాసాల నుడికారంలోనే రూపం తీసుకుంటుంది. అంతిమంగా ఆ నుడికారంలోనే అతనికి అది అర్థవంత మవుతుంది.

ఈ నుడికారం నుండి గిరిజనుల జీవితాన్ని వేరుచేయటం సాధ్యం కాదు. ఈ విశ్వాసాలను తొలగించి వాళ్ళ సమిష్టి జీవనాన్ని, కళాత్మక జీవితాన్ని, మాత్రమే కాపాడాలనుకోవడం అర్థరహితం. గులాబి పువ్వు నుండి గులాబి రంగు తొలగించటం లాంటి ప్రయత్నం అవుతుంది అది. గిరిజనుల జీవితంలోని భౌతిక వెనుకబాటుతనమే వాళ్ళ జీవితాలలో మనకు కనిపించే 'ఉన్నత' లక్షణాలకూ మూఢ విశ్వాసాలకూ రెండింటికీ గూడ కారణమని గుర్తించాలి.

కాని ఆ భౌతిక జీవితం మారవలసింది కాంట్రాక్టర్ల ద్వారా, కలప వ్యాపారస్తుల ద్వారా, సామ్రాజ్యవాద దళారీ పెట్టుబడులద్వారా, గిరిజనేతరుల భూ ఆక్రమణల ద్వారా, ఇతర దౌర్జన్యాల ద్వారా కాదు. దానివల్ల గిరిజన సంస్కృతిలోని మానవీయ అంశ నాశనమవుతుందే తప్ప వాళ్ళ భౌతిక జీవితమూ అభివృద్ధికాదు. వాళ్ళ మూఢ విశ్వాసాలూ నాశనం కావు. యీ దేశ సంపదను మొత్తం శ్రామికుల పరం చేసే విప్లవంలో గిరిజనులు భాగం కావాలి. ఆ విప్లవం విజయవంతమయి, ఒక్క అడవులలోనే కాదు, దేశవ్యాపితంగా సమిష్టి జీవనాన్ని నెలకొల్పి కళనూ సంస్కృతినీ బజారునుండి బయటకు తెచ్చి తిరిగి శ్రామికుల పరం చేసినప్పుడే దేశంలో అందరితోబాటు గిరిజనులు గూడ తమ సంస్కృతిలోని మానవీయ లక్షణాలను కాపాడుకోగలుగుతారు. గిరిజనుల సంస్కృతిలోని ఉన్నత లక్షణాలు కాపాడబడాలంటే అవి మొత్తం సమాజంలో నెలకొల్పబడాలి. అంటే సమాజాన్ని మొత్తం ఆటవికులను చేయటం కాదు. ఇవ్వాళ కొందరు దోపిడీదారుల ఆస్థిగా వున్న విజ్ఞానం అందరి సంపద కావాలి. ఆ సంపద ప్రాతిపదికగా, కొందరు సంపన్నుల సమాజం కాక మొత్తంగా సంపన్నమయిన సమాజం ఏర్పడాలి. ప్రకృతిని చూసి భయపడవలసిన అవసరం పోవాలి. ఆ ఉన్నతమైన మానవీయ స్థాయిలో తిరిగి సమిష్టి జీవనాన్ని కళాత్మక జీవితాన్ని ఇతర మానవీయ విలువలనూ సాధించాలి.

('అడవిలో వెన్నెల' కథల సంకలనంలో ముందుమాట – రచయిత సౌజన్యంతో)

— అజ్ఞాత కవి